నమస్తే తెలంగాణ

మెదక్

I | హైదరాబాద్, మంగళవారం 25 మార్చి 2025 | MEDAK

గజ్వేల్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, చిత్రంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, దేశపతి శ్రీనివాస్, వంటేరి యాదవరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు

గజ్వేల్‌తో కేసీఆర్‌కు
పేగుబంధం

- రాష్ట్రానికే ఆదర్శంగా గజ్వేల్‌ను తీర్చిదిద్దారు ...
- రైలు కల సాకారం చేశారు • సాగు, తాగునీటి వెతలు తీర్చారు..
- విద్యాలయాలకు నిలయంగా మార్చారు
- 15 నెలల కాంగ్రెస్ పాలనలో గజ్వేల్‌కు రూపాయి నిధులు రాలే..
- మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యను అసెంబ్లీలో లేవనెత్తుతా...
- గజ్వేల్‌కు కేసీఆర్ మంజూరు చేసిన నిధులు రూ.181 కోట్లను తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేయాలి
- గజ్వేల్‌లో మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, మార్చి 24: దివాళా కోరు రాజకీయాలను సీఎం రేవంత్ మానుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హితవు పలికారు. సోమవారం గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్‌తో కేసీఆర్‌కు పేగుబంధం ఉందన్నారు. గతంలో ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ మూడు కిలోమీటర్ల రోడ్డుపై 36గుంతలు ఉండేవని, కేసీఆర్ సహకారంతో విశాలమైన నాలుగు వరుసల రోడ్డు వేశామన్నారు. కేసీఆర్ కృషితో రాష్ట్రంలోనే ఆదర్శ పట్టణంగా గజ్వేల్ అభివృద్ధి చెందినట్లు తెలిపారు. కేసీఆర్ వచ్చాక ఈ ప్రాంతంలో అభివృద్ధి జరిగిందన్నారు. దేశ ప్రధానిని గజ్వేల్‌కు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్‌దే అని, ఆయన చేతుల మీదుగా మిషన్ భగీరథను ప్రారంభించి రాష్ట్రంలోనే తొలుత ఇక్కడే ఇంటింటికీ తాగునీరు అందించి దాహార్తిని తీర్చారన్నారు. నేడు కేసీఆర్ ప్రతి ఇంట్లో అక్కాచెల్లెళ్లకు మిషన్ భగీరథ నీటిలో ఉదయం పలకరిస్తున్నాడని, ఆనాడు ఖాళీ బిందెలతో ట్యాంకుల వద్దకు మహిళలు పరుగులు పెట్టేవారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నీళ్లకు కోత పెట్టి సరిపడా సరఫరా చేయడం లేదని విమర్శించారు.

రైతుల పతారా పెంచిన కేసీఆర్..

సాగునీళ్ల రాక, కరెంట్ లేక ధైర్యం కోల్పోయి రైతులు ఆత్మహత్యలకు పాల్పడేవారని, కేసీఆర్ కృషితో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ నిర్మాణంతో గలగల పారే గోదావరి నీళ్ల రాకతో ఈ ప్రాంతం ధాన్యలక్ష్మిగా తాండవం చేస్తూ బంగారు పంటలు పండుతున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. భూముల ధరలు భారీగా పెరిగి రైతులకు పతారా పెరిగిందన్నారు. దరిద్రపు కాంగ్రెస్ పాలనలో ధాన్యలక్ష్మి మాయమైందన్నారు. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ ప్రాంతాల్లో పాఠశాలలు బూత్ బంగ్లాలుగా ఉంటే, కేసీఆర్ బ్రహ్మాండమైన భవనాలు కట్టడంతో సరస్వతి నిలయాలుగా మారాయని, యూనివర్సిటీ, కార్పొరేట్ పాఠశాలతో పోటీపడేలా ఎడ్యుకేషన్ హబ్, అటవీ కళాశాల, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం, గురుకుల పాఠశాలలతో గజ్వేల్ ప్రాంతాన్ని తీర్చిదిద్దినట్లు గుర్తుచేశారు. గోదావరి నీళ్లు గజ్వేల్ పాండవుల చెరువుకు చేరాయని, ఆనాడు ఈ చెరువు విడాకుల పంచాయితీలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండేదని, ఇప్పుడు పిల్లలు ఆడుకునేందుకు అనువైన పర్యాటక ప్రాంతంగా మారిందన్నారు.

గజ్వేల్ అభివృద్ధిలో కేసీఆర్ కనిపిస్తారు..

గజ్వేల్‌లో జరిగిన అసాధారణ ప్రగతిలో కేసీఆర్ కనబడుతారని హరీశ్‌రావు అన్నారు. ఏ ఊరికి పోయినా రోడ్ల పక్కన పచ్చని చెట్లలో కేసీఆర్ కనిపిస్తాడన్నారు. గజ్వేల్ చుట్టూ విస్తరించిన బైపాస్‌రోడ్డు, మహతి ఆడిటోరియం, వెజ్ నాన్ వెజ్ మార్కెట్, పాతూర్ వద్ద మార్కెట్ నిర్మాణంతో ఎంతోమంది రైతులు బతుకుతున్నట్లు తెలిపారు. గజ్వేల్‌కు రైలు కలను సాకారం చేసి, జిల్లా రైతులకు నిరంతరం ఎరువులు దొరికేలా రేక్ పాయింట్‌ను ఏర్పాటు చేయించారన్నారు. వేల కోట్లతో కేసీఆర్ చేసిన అభివృద్ధే ప్రజల కండ్ల ముందు కనిపిస్తున్నదన్నారు. గజ్వేల్‌పై కేసీఆర్ కన్న తండ్రి ప్రేమ చూపిస్తే , రేవంత్ రెడ్డి సవతితల్లి ప్రేమ చూపిస్తున్నాడని విమర్శించారు. గజ్వేల్‌కు మంజూరైన రూ.181 కోట్ల పనులను తిరిగి మంజూరు చేయాలని సీఎం రేవంత్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు. 15 నెలల కాంగ్రెస్ కాలంలో గజ్వేల్‌లో రూపాయి పని చేశావా అని సీఎంను ప్రశ్నించారు. కేసీఆర్ గర్జిస్తేనే మల్లన్నసాగర్ గేట్లు తెరిచావని, తెలంగాణ అల్లాడుతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ అంటే రైతుబంధు అని, రేవంత్ రైతుబంధును మింగిన రాబంధు అని విమర్శించారు. సగమందికి కూడా రుణమాఫీ కాలేదన్నారు. కేసీఆర్‌పై మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదని విమర్శించారు. ఒక నాడు గజ్వేల్ గ్రామంలా ఉండేదని, కరువు, తాగునీటికి కటకట ఉండేదన్నారు. గజ్వేల్ దశదిశామార్చడని, ఇవాళ సకల వసతులతో ఆదర్శ పట్టణంగా మారిందని హరీశ్‌రావు అన్నారు.

కట్ మోషన్‌లో నిలదీస్తా..

మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ.1260 కోట్ల పరిహారం ఇచ్చిందని, మిగిలిన రూ.200 కోట్ల పరిహారం ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు రావడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీలో ఈనెల 26న ఇరిగేషన్‌పై 'కట్ మోషన్'లో మల్లన్నసాగర్ నిర్వాసితుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తానని తెలిపారు. గతంలో రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాల పక్షాన చేసిన నిరాహార దీక్ష నటన అని, అదే నిజమైతే వారి సమస్యలు త్వరగా పరిష్కరించాలన్నారు. అప్పుడేమో తక్కువ పరిహారం ఇసుస్తున్నారని విమర్శించిన నీవు, ఇప్పుడు రెట్టింపు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మధ్యనే కొంతమంది కోర్టు ఆర్డర్ తెచ్చుకున్నారని, వారి సమస్యలు త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవ రెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నాయకులు దేవీ రవీందర్, రాజమౌళి, అంజిరెడ్డి,జుబేర్‌పాషా, బెండే మధు, జేజాల వెంకటేశంగౌడ్, పాండుగౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాఫీ.. మాయాజాలం !

వందశాతం పంట రుణమాఫీ పూర్తయిందని ప్రభుత్వం ప్రకటన

ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షన్నర మంది రైతులకు వర్తించని రుణమాఫీ

- రూ.2 లక్షల లోపల రుణం ఉండి మాఫీ కాని కుటుంబాలు అనేకం
- బ్యాంకుల్లో రూ.2 లక్షల పైన డబ్బులు కట్టి అప్పల పాలైన రైతులు
- నమ్మించి మోసగించిన ప్రభుత్వంపై రైతుల ఆవేదన
- సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్
- పోరుకు సిద్ధమవుతున్న అన్నదాతలు

సిద్దిపేట, మార్చి 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వందశాతం పంట రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. దీనిపై చాలామంది రైతులు మండిపడుతున్నారు. ఎందుకంటే ఇంకా చాలామంది రైతులకు రుణ మాఫీ కావాల్సి ఉంది. కానీ, ప్రభుత్వం మాత్రం వందశాతం రుణ మాఫీ చేశామని చెబుతున్నది. రుణమాఫీ ప్రక్రియ పూర్తయిందని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంతో ఉమ్మడి మెదక్ జిల్లాలో లక్షన్నరకు పైగా రైతు కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయి. రెండు లక్షల రూపాయల లోపల ఉన్న రైతులు లక్షన్నరకు పైగానే ఉన్నారు. ప్రభుత్వ తీరుపై సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని రైతులు, రైతు సంఘాల నాయకులు పోరు బాటకు సిద్ధమవతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి మెదక్ జిల్లాలో 3లక్షల మంది రైతు కుటుంబాలకు రుణమాఫీ చేశామని చెబుతున్నది. కానీ, ఇంకో లక్షన్నర రైతు కుటుంబాలకు మాఫీ చేయాల్సి ఉన్నది. ఏ గ్రామానికి వెళ్లి చూసినా ఇంకా 50శాతం పైగా రైతులకు రుణమాఫీ కాలేదు.వీరి రుణ మాఫీ చేయకుండానే వందశాతం చేశామని ప్రభుత్వం చెబుతుండడంతో అన్నదాతలు ఆవేదనకు గురవుతున్నారు. రెండు లక్షల పైన రుణం ఉన్న రైతులు మిత్తికి డబ్బులు తెచ్చి పైన డబ్బులు బ్యాంకుల్లో కట్టారు. తీరా ప్రభుత్వం వారికి రుణమాఫీ వర్తింపజేయక పోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం చేయాలనుకున్న రెండు లక్షల రూపాయల రుణమాఫీ రైతుల లోన్ అకౌంట్‌లో జమచేసి మిగతా డబ్బులు కట్టుంటే బాగుండేది. కానీ, ప్రభుత్వం అలా చేయలేదు. రెండు లక్షల రూపాయలపైన ఉన్న రుణం డబ్బులు కడితేనే రుణమాఫీ అవుతుందేమోనని చాలామంది రైతులు వడ్డీలకు తెచ్చి మిగతా డబ్బులను బ్యాంకుల్లో కట్టారు. వీరి అప్పులు తడిసి మోపెడయ్యాయి. ఎంతో మంది రైతులు జిల్లాలో రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. తీరా ప్రభుత్వ ప్రకటనతో రైతులంతా నిరాశలో మునిగిపోయారు.

సిద్దిపేట జిల్లాలో...

ప్రభుత్వ అధికారిక యంత్రాంగం చెబుతున్న ప్రకారం సిద్దిపేట జిల్లాలో మొదటి విడతలో 53,129 మందికి రూ.290.21 కోట్లు, రెండో విడతలో 27,955 మందికి రూ.279.33 కోట్లు, మూడోవిడతలో 21,239 మందికి రూ.273.51 కోట్లు, నాలు గో విడతలో 9.063 మందికి రూ.95.255 కోట్లు , మొత్తం 1,11,386 మంది రైతులకు రూ. 938.305 కోట్లు చేసినట్లు లెక్కలు చెబుతున్నాయి.

మెదక్ జిల్లాలో...

మెదక్ జిల్లాలో రెండు లక్షల రుణాల విషయంలో ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం మొదటి విడతలో 48,251 మంది రైతులకు రూ.240.78 కోట్లు, రెండో విడతలో 21,618 మంది రైతులకు రూ.204.40 కోట్లు, మూడో విడతలో 159.03కోట్లు, నాలుగో విడతలో 6,389 మందికి రూ. 50 కోట్లు, మొత్తంగా జిల్లాలో 88,683 మందికి రూ. 654.21 కోట్ల రుణాలు మాఫీ చేసింది.

సంగారెడ్డి జిల్లాలో...

సంగారెడ్డి జిల్లాలో మొదటి విడతలో 50,538 మంది రైతులకు రూ. 277.73 కోట్లు, రెండో విడతలో 27,233 మంది రైతులకు రూ. 286.93 కోట్లు, మూడో విడతలో 19,795 మంది రైతులకు రూ. 277.74 కోట్లు, నాలుగో విడతలో 11,301 మంది రైతులకు రూ. 110. 39 కోట్లు మాఫీ చేశారు. మొత్తం జిల్లాలో 1,08,867 మంది రైతులకు రూ. 952.79 కోట్లు మాఫీ చేశారు.

గజ్వేల్‌లో ఇఫ్తార్ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, చిత్రంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్

మైనార్టీలకు కాంగ్రెస్ చేసింది గుండుసున్నా..

- రంజాన్ తోఫా బంద్‌జేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ పెద్దపీట
- కేసీఆర్ తరపున మీ అందరికీ రంజాన్ శుభాకాంక్షలు
- గజ్వేల్ ఇఫ్తారు విందులో ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, మార్చి 24: పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లిం కుటుంబాలకు కేసీఆర్ రంజాన్ తోఫా ఇచ్చేవారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దానిని బంద్ చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం సాయంత్ర గజ్వేల్ మదీనా మసీద్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ముందుగా కేసీఆర్ తరపున మీ అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. 16 నెలల కాలంలో మైనార్టీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేసిందో నాకంటే మీకే బాగా తెలుసన్నారు. మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ ఎంతగానో కృషిచేశారని, తాను మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న నుంచి ఏటా ఇక్కడ ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నట్లు తెలిపారు. మైనార్టీల కోసం బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో విలీనం చేస్తున్నదన్నారు. దీంతో మైనార్టీ గురుకులాలకు ఉన్న గుర్తింపు పోయే ప్రమాదం ఉందన్నారు. కేసీఆర్ మైనార్టీ వర్గానికి చెందిన మహమూద్ అలీకి డిప్యూటీ సీఎం, హోంమంత్రి పదవి వంటి కీలక పదవులు ఇచ్చి గౌరవించారని, కాంగ్రెస్ కేబినేట్‌లో మైనార్టీలకు చోటు కల్పించలేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో శాంతిభద్రతలు బాగాలేవని. చాలాచోట్ల గొడవలు జరుగుతున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత బడ్జెట్‌లో మైనార్టీల కోసం రూ.3వేల కోట్లు కేటాయించి, రూ.వెయ్యి కోట్లు విడుదల చేసి అవి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. దీనిపై తాను అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయాన్ని హరీశ్‌రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో గజ్వేల్‌లో రూ.4కోట్లతో మదీనా మసీద్ ఫంక్షన్‌హాల్, షాదీఖానా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ప్రజ్ఞాపూర్, తూప్రాన్‌తో పాటు జిల్లా అంతటా ఖబ్రస్థాన్‌ల పనులు చేపట్టామని, కేసీఆర్ మంజూరు చేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు నిలిపివేసిందని, ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విందులో ఎమ్మెల్సీలు డాక్టర్ యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు జుబేర్‌పాషా, విరాసత్ అలీ, జాఫర్‌ఖాన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మసీద్ కమిటీ అధ్యక్షుడు మతిన్, మాజీ అధ్యక్షుడు యూసూఫ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జకీయొద్దీన్, నాయకులు ఉమార్, రియాజ్, కరీం, లతీఫ్ పాల్గొన్నారు.

గజ్వేల్ మసీద్ కమిటీ మాజీ చైర్మన్ యూసూఫ్‌నకు కర్జూరా తినిపిస్తున్న హరీశ్‌రావు

మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌కు కర్జూరా తినిపిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

గజ్వేల్ బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు నవీజ్‌మీరాకు కర్జూరా తినిపిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

రిజర్వాయర్లు నింపి పంటలు కాపాడాలి

అసెంబ్లీలో మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల సమస్యలపై అసెంబ్లీలో గళ మెత్తిన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, మార్చి 24 : చేర్యాల ప్రాంతంలో నెలకొన్న సాగునీటి సమస్య, పెండింగ్ పనుల గురించి సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. తపాస్‌పల్లి, లద్నూరు రిజర్వాయర్లకు దేవాదుల నుంచి వెంటనే నీటిని పంపింగ్ చేసి పంటలను కాపాడాలని కోరారు. మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటిని అందించేందుకు రూ. 350 కోట్లతో కాల్వ నిర్మించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఈ పనులు పూర్తి చేయాలని కోరారు. మల్లన్నసాగర్ నుంచి గ్రావిటీ ద్వారా నీళ్లు తపాస్‌పల్లి తరలించవచ్చని, తద్వారా 365 రోజులు రిజర్వాయర్లలో నీళ్లు ఉంటాయని తెలిపారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. చేర్యాలలో ప్రభుత్వ దవాఖాన భవనం, సమీకృత ప్ర భుత్వ కార్యాలయాల భవన సముదాయం పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. చేర్యాల, జనగామ దవాఖానలకు కావాల్సిన పరికరాలను సరఫరా చేయాలని సభదృష్టికి తీసుకువచ్చారు.

మా ఇంట్లో ముగ్గురికి కాలేదు..

కొమురవెల్లి, మార్చి 24: మా ఇంట్లో ముగ్గురు పంట రుణం తీసుకున్నం. కాంగ్రెస్ ఎన్నికలప్పుడు ఇంట్లో ఎంతమంది పంట రుణం తీసుకున్నా రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పడంతో రుణం మాఫీ అయితదానుకున్నం. తర్వాత రూ.2లక్షలపైన ఒక్క రూ పాయి ఉన్నా మాఫీ రాదనడంతో రూ.60 వేలు కట్టినం. ముగ్గురికి కలిసి ఇంకో రూ.1.80 లక్షలు అసలు ఉండే. మా ఇంట్లో ముగ్గురిలో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదు. మా ఊరిలో 30 మందికి రుణమాఫీ కాలేదు.

– బ్రహ్మండ్లపల్లి కనకయ్య, రైతు, గురువన్నపేట

చేతి నుంచి రూ.65 వేలు కట్టిన..

యూనియన్ బ్యాంకు లో రూ.2,64,766 పంట లోన్ ఉంది. రే వంత్ ప్రభుత్వం వ చ్చాక రెండు లక్షల్లోపు రుణమాఫీ చేస్తానని అంటే రూ.65,000 వేలు అప్పు చేసి బ్యాం కులో కట్టా. ఇంతవ రకు రుణమాఫీ కాలేదు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు నాకు రూ.80 వేల రుణమాఫీ అయింది. రేవంత్‌రెడ్డి ప్రభు త్వం వచ్చాక ఇప్పుడు మాకు లోన్ మాఫీ చెయ్యక అన్యాయం చేసింది.

–దామెరపల్లి శ్రీను, రైతు, గుర్రాలగుంది, నారాయణరావుపేట

మా ఇంట్లు ఇద్దరికి కాలేదు..

గజ్వేల్, మార్చి 24: ప్రజ్ఞాపూ ర్ మంజీరా గ్రామీణ బ్యాంకు లో రూ.1.90 లక్షల పంటరు ణం తీసుకున్న. అసలుకు మి త్తికి కలి పితే రెండు లక్షల పైబడిన డబ్బులుంటే రెన్యువల్ చేశా. అయినా నాకు రుణమాఫీ కాలేదు. అదే బ్యాం కులో నా భార్య బాలమణి పేరు మీద రూ.20 వేలు రుణం తీసుకున్నా. మా ఇద్దరిలో ఎవ రికీ కాలేదు. మా ఊరిలో రుణమాఫీ కాని రైతులు చాలామంది ఉన్నారు. ప్రభుత్వం చెప్పిందొకటి చేసిందొకటి.

– గుండబోయిన మల్లేశం, రైతు, అక్కారం, గజ్వేల్ మండలం

మాకెందుకు రుణమాఫీ కాలేదు..

దుబ్బాక,మార్చి 24: మాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు దుబ్బాక బ్రాంచ్‌లో నా పేరిట రూ.40 వేలు, నా భార్య పేరిట మరో రూ.30 వేల పంట రుణం ఉంది. రుణమాఫీ జాబితాలో మా పేర్లు రాలేదు. బ్యాంకుకు వెళ్లి సార్లను అడిగితే రుణమాఫీ వర్తించలేదని చెబుతున్నారు. నా పేరిట తీసుకున్న అప్పు రూ.40 వేలకు వడ్డీతో కలిపి రూ.50 వేలు అయ్యిందని బ్యాంకు సార్లు చెబుతున్నారు. నా భార్య పేరిట మరో రూ.40 వేలు వరకు ఉందన్నారు. మా ఇద్దరికి కలిసి లక్ష రూపాయల్లోపే పంట రుణం ఉంది. అయినా ఒక్కరికి కూడా రుణమాఫీ కాలేదు. అప్పు పెరిగిపోవట్టే. భూముల ధరలు తగ్గవట్టె. వేసిన పంట ఎండిపోవట్టే. మేము ఏమి చేయాలి ఇక. కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని నిండా ముంచింది.

– ఎంగారి గోపాల్‌రెడ్డి, రైతు, దుబ్బాక

వడ్డీతో కలిపి అప్పు పెరిగింది..

దుబ్బాక,మార్చి 24: నాకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. పంట సాగుకు అప్పట్లో రూ.2 లక్షలు బ్యాంకులో అప్పు తీసుకున్న. బ్యాంకుకు వెళ్లి రుణమాఫీ కోసం తెలుసుకుంటే మాఫీ కాలేదని చెబుతున్నారు. బ్యాంకులో తీసుకున్న రూ.2 లక్షల అప్పుకు వడ్డీతో కలిపి రూ.4 లక్షల వరకు పెరిగింది. కాంగ్రెస్ సర్కారు రైతులకు రుణమాఫీ చేసిందని చెబుతుంది. నాకు మాత్రం బ్యాంకులో రుణం మాఫీ కాలేదు. మా దుబ్బాకలో చాలా మంది రైతులకు రుణం మాఫీ కాలేదు. ఎవరిని అడిగినా సరైనా సమాధానం చెప్పడం లేదు. కాంగ్రెస్ సర్కారు రైతుల జీవితాలతో చెలగాటమడుతున్నది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాకు పంట రుణ మాఫీ చేయకుండా అన్యాయం చేసింది.

– ఎంగారి రాజిరెడ్డి, రైతు, దుబ్బాక

హత్నూరా గ్రామాలను జిన్నారంలో కలపండి

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

అసెంబ్లీలో మాట్లాడుతున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మార్చి 24: నర్సాపూర్ నియోజకవర్గం హత్నూరా మండలంలోని రొయ్యపల్లి, నాగారం, షేర్‌ఖాన్‌పల్లి, అక్వంచ గూడా గ్రామాలను జిన్నారం మండలంలో కలపాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రతిపాదనను ఇంతకు ముందే పంపించామని గుర్తుచేశారు. ఈ గ్రామాలు జిన్నారం మండలానికి 4 కిలోమీటర్ల దూరంలోనే ఉంటాయని వెల్లడించారు. మండల హెడ్ క్వార్టర్‌కు రావాలంటే 20 కిలోమీటర్లు ప్రజలు ప్రయాణం చేయాల్సి వస్తున్నదని, దీంతో ప్రజలు వ్యయప్రయాసాలకు గురవుతున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా కూడా హత్నూరా నుంచి రావడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదన్నారు. ఈ గ్రామాలను హత్నూరా మండలం నుంచి తొలిగించి జిన్నారం మండలంలో కలపాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు.

అగ్నిగుండం దాటుతున్న ఆలయ అర్చకులు

వెళ్లొస్తాం..మళ్లొస్తాం మల్లన్న

- ముగిసిన కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు
- భక్తిశ్రద్ధలతో కొనసాగిన అగ్నిగుండాలు

చేర్యాల, మార్చి 24: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు అగ్నిగుండాలతో ఆదివారం ముగిశాయి. అగ్నిగుండాలుఆదివారం అర్ధరాత్రి ప్రారంభమై సోమవారం వేకువజాము వరకు కొనసాగాయి. దత్తపీఠాధీశులు సిద్ధేశ్వర మహా స్వామీజీ వైదిక పర్యవేక్షణలో ఆలయ ఈవో రామాంజనేయులు, కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది, ఒగ్గు పూజారుల ఆధ్వర్యంలో వీరశైవ ఆగమ శాస్త్ర పద్ధతిలో నిర్వహించారు. తొలుత స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు గర్భాలయం నుంచి కల్యాణ వేదిక ఆవరణకు తీసుకువచ్చి అగ్నిగుండం దాటించారు. అనంతరం భక్తులు అగ్నిగుండం దాటి ఆలయ గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. అగ్నిగుండం ముగించిన అనంతరం సోమవారం ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పది ఆదివారాలపాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. లక్షలాదిగా భక్తులు దర్శించుకున్నారు. బుకింగ్, హుండీ ఆదా యం రికార్డులు స్థాయిలో పెరిగింది. ఏఈ వో బుద్ది శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలందించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, సీఐ శ్రీను, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



నిద్దేశ్వర స్వామి ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలు తీసుకువస్తున్న అర్చకులు

బుదేరాలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

మోసాలకు కేరాఫ్ కాంగ్రెస్

అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్

మునిపల్లి, మార్చి 24 : కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజలను మోసం చేస్తున్నదని, ఆరు గ్యారెంటీలు, హామీల అమలు విస్మరించిందని అందోల్ మాజీఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. సోమవారం ఖమ్మంపల్లి శివారులోని శ్రీసాయి గార్డెన్‌లో మునిపల్లి మండలంలోని ఖమ్మంపల్లి, బుధేరా, బేలూర్‌కు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా చంటి క్రాంతి కిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, మోసపూర్తి పాలన నచ్చక ఆ పార్టీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. కేసీఆర్ తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే, రేవంత్ సర్కారు రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నట్లు విమర్శించారు. మునిపల్లి మండలం లింగంపల్లిలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం